# రంగడు

X

రచన :
శ్రీ కృష్ణమూర్తి పట్నాయిక్.

–ఇంకా నువు నిద్రపోలేదా, లచ్చీ!'

'నిద్రపోతా. ఇంకా ఎంతో రాత్రి కాలేదు. పది గంటల బండి ఇంకా రాలేదు.'

ఉష్ణంవల్ల రోజంతా తెలివిలేని భర్త మాట్లాడేసరికి తేరుకుని అన్నది లచ్చి.

'చాలా జొరం వచ్చినట్టుందే!'

'జొరమా! ఓయబ్బ! ఒళ్ళు సలసల కాగిపోతూంటేను. ఏమిటో ఈ పాడు జొరాలు!'

'కూడు తిన్నావా?'

లచ్చి జవాబివ్వలేదు. ఇంట్లో బియ్యం నిండుకుందని రంగడికి తెలుసు. అయినా మనసు ఒప్పక అడిగాడు. లచ్చి మౌనం అతనికి అర్థమైంది.

'పిల్లాడైనా తిన్నాడా?' జంకుతూనే అడిగాడు.

'కరణంగారి అమ్మగారు ఇంత కూడు పంపేరు. అది పెట్టా తిన్నాడు.'

రంగడు లేచి కూచున్నాడు.

'కొంచెం నీళ్ళిస్తావా?'

లచ్చి చెంబుతో నీళ్ళు తెచ్చి యిచ్చింది. గడగడా తాగేశాడు రంగడు.

'కరణంగారి అమ్మగారు నీకేమైనా పెట్టలేదా?'

'రోజూ ఎవరు పెడతారు. వాళ్ళింట్లోనూ జొరాలే! కోతలింకా కాలేదు.'

'లక్ష్మీ ఓ అనే ఈ రోజుల్లో ఎప్పుడూ ఆకలితో ఉండలేదు. ఈ ఏడు ఉండాల్సి వచ్చింది. ఇంకా సంవత్సరమంతా ఎలా గడుస్తుందో!'

రంగడు మెల్లిగా నిలుచున్నాడు. లచ్చి ఆపబోయింది. కాని రంగడు బయటికి వచ్చాడు. బయట వెన్నెల వేస్తూ ఉంది. కాని పొగమంచువల్ల అంతా మసక మసకగా ఉంది. లచ్చి భయపడుతూ అతని వెనక నిలుచుంది.

'మంచులో నిలవొద్దు. ఇంట్లోకి రా.'

'ఆఁ వస్తా.'

కాని, రంగడు ఇంటికి రాలేదు. అలానే నిలుచుని నాలుగువైపులా చూశాడు.

'ఇంట్లోకి రా–చలేస్తోంది.'

రంగడు మాట్లాడలేదు. ఉష్ణంవల్ల పోయిన బలం అతనికి ఇప్పుడు వచ్చినట్టుంది. లచ్చి భయపడి బలాత్కారంగా అతణ్ని లాక్కుపోబోయింది. రంగడు నవ్వాడు.

'ఎందు కా భయమే! ఎక్కడికీ పోను. ఆ తువాలు ఇలా ఇయ్యి.'

లచ్చి ఇంకా భయపడింది. 'ఎక్కడి కెడతావు? రోజంతా తిండిలేదు. ఒళ్ళు ఎలా వణుకుతోందో!'

పిల్లాడు తినలేదు. నువ్వుకూడా తినలేదు. నాకూ ఆకలేస్తోంది. ఇంక ఈత కల్లు దొరుకుద్దేమో చూస్తా. ఈ మంచులో ఎవరూ కాపలా ఉండరు.'

లచ్చి తువాలు తెచ్చి ఇచ్చింది. చెట్టెక్కగలవా? కేనొచ్చేదా?'

'అక్కర్లే. ఈ ఎదవ జొరంగాని, ఈ రంగడి ఎదట ఎవరు నిలబడతారు? పిల్లాడిని చూస్తూ ఉండు, ఇప్పుడే వస్తా.'

రంగడు కదిలాడు. కాళ్ళు సరిగ్గా పడకుండా వున్నాయి. చాల నీరసంగా ఉంది. అయినా అతను వెళ్ళి తీరాలి. వెళ్తూనే ఉన్నాడు.

ఒక అరగంటలో ఒక కుండను పట్టుకుని ఇంటికి వచ్చాడు. కుండలో ఏమంత ఎక్కువగా కల్లులేదు. ఒక్కొక్కరికి ఒక్కొక్క గ్లాసు వచ్చింది. పిల్లాడు తృప్తిగా తాగాడు. ఇంకా కావాలనన్నాడు.

'ఉండు. మళ్ళా వెళ్తా. మరొకటి తెస్తా. లచ్చి అడ్డు పడింది. 'వద్దు. మరి వెళ్ళకు.'

'ఇప్పుడే వచ్చేస్తానే!'

రంగడు మళ్ళా వెళ్ళి ఖాళీ కుండను యథాస్థానంలో పెట్టేసి మరో చెట్టు యెక్కాడు. ఆ చెట్టు చాలా పెద్దది. కుండలో నిండుగా రసం ఉండొచ్చు. చెట్టు ఎక్కడం అంత సులువుగా లేదు. కాని, పది చిన్న చెట్లు ఎక్కే బదులు ఒక పెద్ద చెట్టు ఎక్కడం మేలు.

ఎలాగో చెట్టెక్కి కుండను తీస్తుండగా ఏదో శబ్దం వినబడింది. కిందకు చూశాడు. కాని, మంచువల్ల ఏదీ కనబడకుండా ఉంది: కాని శబ్దం శుభ్రంగా వినబడుతోంది.

ఏమిటా శబ్దం? చెవి ఒగ్గి విన్నాడు. తనను ఎవరూ

పసికట్టలేదు. తరుచు రానూలేదు. కాని, ఎవరో ధాన్యం కోసి తీసికెళ్ళిపోతూన్నట్టు ఉంది.

వెధవది ఎంత దుర్దినం: తనకు జ్వరంకాని ఇలాంటి రాత్రి-ఇలాంటి సమయం,తను వృధా చేయికపోదుడు.

కుండను తీసి కిందికి దిగసాగాడు. అంతలో ధాన్యం మోపు తలమీద పెట్టుకొని ఒక మనిషి ఆ చెట్టుకింద నుంచి పోతున్నాడు. మూడు వంతుల చెట్టు దిగేసరికి అతని కాళ్ళు పట్టుతప్పాయి. జారి పడిపోయాడు. ఆ పడడం సరిగ్గా కింద పోతుండే మనిషి నెత్తిమీద పడ్డాడు. కుండ తునాతునకలై పోయింది. ధాన్యం దొంగ అల్లంత దూరంలో బోర్లా పడ్డాడు.

'దెయ్యమర్రోయ్! రండి, రండి!' ధాన్యం దొంగ గట్టిగా కేకలేశాడు. కాని ఏం లాభంలేకపోయింది. దాంతో గభాల్ని లేచి మళ్ళా వెనక్కి చూడకుండా పరుగుతీశాడు. ఆ మంచులో అతను ఎవడో, ఎక్కడికి వెళ్ళిపోయాడో తెలీనేలేదు.

రంగడు నవ్వి లేచాడు. ఒల్లంతా కల్లుపడి బంకబంకగా ఉంది. చలిగాలి ఎముకల్ని కొరికేస్తోంది. మళ్ళా జ్వరం రావచ్చని భయపడ్డాడు.

కొంచెంసేపు చూశాడు. దొంగ మరిరానేలేదు. తన అదృష్టం పండింది. విధివిలాసం ఎంత విచిత్రం! కష్టపడేది ఒకరు. అనుభవించేది ఇంకొకరు! ఆ దొంగ ధాన్యం కోసి అంతవరకూ మోసుకొచ్చాడు. తను దాన్ని ఇంటికి తీసుకెళ్తాడు! అది తమకు పదిరోజులవరకు సరిపోవచ్చు. కాని ఆ రాత్రి ఏమిటి తినడం? కనీసం సారా అయినా లేదు. ధాన్యం ప్రస్తుతానికి పనికిరాదు. పిల్లాడు మరికొంచెంసేపుపోయాక నిద్రపోతాడు. కాని, లచ్చి సంగతి? అది రాత్రంతా మేలుకోవాలి. ధాన్యం అంతా తెల్లారేసరికి తీసెయ్యాలి. లేకుంటే పట్టుబడిపోతారు.

ధాన్యం మోపు ఎత్తాడు. బరువుగా ఉంది. అయినా ఎలాగో ఇంటికి దార్తీశాడు.

కొన్ని నిముషాల్లో అతను ఇల్లు చేరిపోవచ్చు. మరే బాధా ఉండదు. కాని! ఎవరో వెనకనుంచి కేకవేస్తూన్నట్టు వినబడింది. 'దొంగ! దొంగర్రోయ్!' మరుక్షణం రెండు బలమైన చేతులు అతణ్ణి పెనవేసేశాయి.

రంగడు ధాన్యంమోపు కిందపడేసి విడిపించుకునేందుకు శతవిధాలా ప్రయత్నించాడు. కాని, లాభంలేక పోయింది. జ్వరం అతణ్ణి తినేసింది. మరుక్షణంలో పదిమంది పోగైపోయారు. లచ్చికూడా పిల్లాణ్ణి పట్టుకుని అక్కడికి వచ్చింది.

ఎవరు దొంగ?

అగ్గిపుల్ల వెలిగించి చూశారు. రంగడు మొగం వేలాడేసి బిక్కమంటూన్నాడు. లచ్చి నిర్విణ్ణురాలైంది.

'నువ్వు ఈయాల జోరంతో రోజంతా ఇంట్లో పడుంటివేమో!' అగ్గిపుల్ల వెలిగించిన అతను వ్యంగంగా అన్నాడు.

'ఈళ్ళు పగలు ఇలానే ఉంటారు. రాత్రి ఏమీ ఉండదు. ఎక్కడలేని బలం వస్తుంది.' ఇంకొకడు అన్నాడు.

అంతా ఒక్కసారి నవ్వారు.

'నేను దొంగలాడలా.' తలెత్తి రంగడు నీరసంగా అన్నాడు.

'నువ్వు దొంగలాడలా? బహుశా మరో దొంగనీ తలమీద ఈ ధాన్యంమోపు ఎత్తేశాడేమో:' మరొకడు అన్నాడు.

మళ్ళా అంతా నవ్వారు.

'నిజం నేను దొంగలాడలా, కొంచెం కల్లు తీడానికి వెళ్లా. చెట్టు దిగుతూంటే జారి సరిగ్గా ఇటే పోతూన్న దొంగనెత్తిమీద పడ్డా. దొంగ పారిపోయాడు. నేను ఇలా చిక్కిపోయాను.'

కాని, కళ్ళెదుట ధాన్యంతో పట్టుబడిపోతే ఎవరు ఈ మాటలు నమ్ముతారు? కాపలావాణ్ణి కబురుపెట్టారు, కాపలావాడు మరికొందరితో వచ్చాడు. వాళ్ళు రంగణ్ణి మరికొన్ని ప్రశ్నలు వేశారు. రంగడు ఏమీ చెప్పలేక పోయాడు. కాని, లచ్చినీ, పిల్లాణ్ణీ మంచులో నిలవక ఇంటికి పొమ్మన్నాడు.

కాపలావాడు పోలీసులకి రిపోర్టు ఇవ్వడానికి వెళ్ళిపోయాడు. ఈలోగా తెల్లారింది. గుంపులో ఒకడు- 'పదండ్రా ఎవరి పొలంలో ధాన్యం దొంగలాడాడో చూద్దాం. ఈడు చెప్తాడా? మనకి సులుగ్గా తెలిసిపోద్ది.' అన్నాడు.

నలుగురూ నాలుగువైపులకి వెళ్ళారు. వాళ్ళకి ఎంతో సేపు పట్టలేదు కనుక్కోడానికి. కాలవడొక్కని పల్లంలో ఉన్న పొలంలో ఒక భాగంలో ధాన్యం కోసిఉంది,

అది చూడగానే అంతా ఆశ్చర్యపోయారు. అది మరెవరి పొలమో కాదు. అది రంగడి పొలమే.

ఈ ప్రపంచంలో రంగడికి ఉన్నవి రెండే! ఒకటి ఆ చిన్నపొలం రెండోది ఆ చిన్న కొంప!

తరవాత రంగణ్ని విడిచిపెట్టేశారు. అతను సంతోషించనూ లేదు. కోపగించనూ లేదు. జ్వరం మళ్ళా కాసాగింది. వణుకుతూ ఇంటికి వెళ్ళి చిరిగిన దుప్పటి కప్పుకుని తెలివి తప్పి పడిపోయాడు. రాత్రి తొమ్మిదింటికి గాని తెలివిరాలేదు, జ్వరం తగ్గింది. చంద్రుడు మళ్ళా పొగమంచు లోంచి తొంగిచూస్తున్నాడు.

'నువు రోజంతా గంజి చుక్కైనా తాగలే!' అంది లచ్చి.

రంగడు జవాబివ్వలేదు.

'దాహం వేస్తోంది. కొంచెం నీళ్ళియ్యి 'అని మెల్లిగా కేకేస్తూంటే ఎవరో ఇంట్లోకి వచ్చి, 'దీపం లేదేంటి రంగా?' అన్నాడు.

'ఎవరదీ?'

'నేను రామిగాణ్ణి.'

ఈ రామిగాడు ఒక్కడే గతరాత్రి రంగడికి ఏమీ అనలేదు. నలుగురూ నాలుగుమాటలన్నారు. ఇతను ఏమీ అనలేదు. ఒక్కమారు రంగడికి గతరాత్రి సంఘటన జ్ఞాపకానికి వచ్చింది.

'ఏమిటి విశేసాలు రామీ?'

'చెప్తా. మొదట దీపం వెలిగించు.'

లచ్చి దీపం వెలిగించింది. రామిగాడు ఒక పెద్దా పళ్ళెంలో అన్నం, కూరా, పప్పూ, చారూ తెచ్చి రంగడి ఎదట పెట్టాడు. రంగడు ఆశ్చర్యపోయి, 'ఏమిటిది రామీ?' అన్నాడు.

'ఏమీలేదు. మొదట మీరంతా తినండి. తరవాత చెప్తా.'

అంతా తిన్నారు. తరవాత మిత్రులిద్దరూ బయట కూచుని మాటల్లో పడ్డారు.

'గతరాత్రి ఎంతపని జరిగింది చూశావా రామీ?'

'చూశా. అంతా చిత్రంగ ఉంది.'

'మంచి చిక్కులో పడిపోయా. ఇంతకూ అసలు దొంగ ఎవరో!'

రామిగాడు సిగ్గుపడుతూ, 'రంగా మరేమీ అనుకోక ఆ దొంగని నేనే!' అన్నాడు.

'నువా! నా పొలంలో కోశావా?'

'అవును! పొగమంచులో నీపొలమని తెలీలా. మరేమీ అనుకోకు రంగా.'

'చిత్రమే! దొంగలాడక దొంగలాడక నువు నా పొలంలో దొంగలాడావు. నేను దొంగలాడకున్నా నా ధాన్యంతో నే నేను దొంగనని పట్టుబడ్డాను.. ' బలే బాగుంది!'నవ్వాడు రంగడు. రామిగాడుకూడానవ్వాడు.

'నీకు నొప్పి కొట్టలా? ఎంత బరువుగుంది ఆమోపు.'

'నొప్పని మెళ్ళగంటావా? రోజంతా తలదిమ్మకొట్టి మెడ నొప్పితో సచ్చా!'

మళ్ళా ఇద్దరూ నవ్వారు. ఇద్దరి హృదయాలు తేలిక పడ్డాయి.

'ఇక వస్తా రంగా. అయిందేదో అయింది. మరేమీ అనుకోవద్దు.'

'లేదురా. వెళ్ళు. పడుకో. రాత్రయింది.'

ఆ రాత్రి ఇద్దరూ నిశ్చింతగ నిద్రపోయారు.

